పంతం ★

పద్మరాజు

గోదావరివరదలు, పొంగలాగ చుట్టలు చుట్టుకుంటూ ప్రవహించే ఆ చిక్కనీటిని చూస్తే భయంవేస్తుంది ఎల్లాంటివాళ్ళకయినా. చాకలివాళ్ళు మాత్రం నదీప్రవాహంలోకి నిర్భయంగా ఈదుకువెళ్ళి పుల్లల్ని ఏరుకుని గట్టుకి తెస్తూంటారు. ప్రతీరోజూ ప్రొద్దున్నే చాకలివాళ్ళంతా చిన్న తెప్పల్ని పొట్టకింద వేసుకుని గోదావరిలోకి దిగుతారు. సాయంకాలమయేసరికి గట్టునిండా పుల్లలుగుట్టలు పడిపోతూఉంటాయి. మగవాళ్ళంతా నడేట్లోకి పోతే ఆడవాళ్ళు పొడుగు పాటిగడలకి చివరకొంకెలుకట్టి గట్టున నిలబడి అందినంతమేర పుల్లలు దాటి పోనియ్యకుండా గట్టుకి లాక్కుంటూ ఉంటారు. ఆ రోజుల్లో గోదావరి మహాకోలాహలంగా ఉంటుంది. గోదావరి తన మహాప్రవాహంలో అరణ్యాలని అరణ్యాలని వేళ్ళతో పెకలించుకు వస్తూఉంటే, ఆ గోదావరి నరికట్టిపుల్లలనన్నింటినీ గట్టుకి చేర్చి, ప్రకృతికంటే తమ ఆధిక్యతని నిలబెట్టుకుంటారు మానవులు. ఆ పుల్లలు పట్టడానికి చాలా నేర్పు కావాలి. కేవలం బలంవల్ల ఉపయోగమేమీ ఉండదు. నదీప్రవాహంలో ఏదైనా ఒకచెట్టు మనవశం అయితే, ప్రవాహానికి కొంతమనం లొంగినట్టయితేగాని అచెట్టు మనస్వాధీనంలోకి రాదు. ఆపుల్లలు పట్టడంలో ఒక విధమయిన పోటీ ఉంది. అది చాకలివాళ్ల నేర్పుకి ఒకకొలతబద్ద. ఒక్క పుల్లలమీద ఆశేకాదు. ఆపోటీలో వాళ్ల గౌరవలాఘవాలు ఇమిడి ఉన్నాయి. అందులో నెగ్గినవాడు జాతికంతకీ వీరుడన్నమాట. ఆఉత్సాహంచేతే వాళ్లు ప్రాణాల నయినా లక్ష్యపెట్టకుండా సుడిగుండాలలోకి కూడా పోతూ ఉంటారు.

రామికి చాలా పెంకిదని పేరు. ప్రతీవిషయంలోనూ అందరితోనూ పోట్లాడడం దాని స్వభావం. అది కనుచీకటి ఉండగానే లేచి ఒకకొంకికట్ట పుచ్చుకుని దాని ఇంటికి దగ్గరగా ఉన్న రేవులోకి వెళ్ళి నిలబడుతుంది. ఇంక ఆనాడు ఆరేవులోకి ఎవరూ రావడానికి వీలులేదు. ఎవరయినా వచ్చినట్టయితే పోట్లాట ప్రారంభమవుతుంది. దానినోరు మహావాడి. రెండు మూడు సార్లు పోలీసువచ్చి దాన్ని దడిపించాడు. తక్కినవాళ్ళమీదకిమల్లేనే అది వాడిమీదకి చఱ్ఱుమని లేచింది. అధికారులు తనకిచ్చిన అధికారాన్ని దానిమీద మాత్రం చలాయించలేకపోయాడా పోలీసు. గోదావరీ, పుల్లలూ, కేవలం తన ఒక్కత్తివేకావని దానికర్థమయినప్పటికీ, తనందరికంటే మొట్టమొదట వచ్చి ఉండగా, ఇంకొకళ్లు తనరేవులోకి తనతరవాత వచ్చి పుల్లలు పట్టుకోడంలో ఉండేసబబు ఏమిటో ఏ న్యాయశాస్త్ర వేత్తా, దానికి నచ్చచెప్పలేడు. న్యాయం తమవైపుని ఉన్నా, న్యాయంకంటే బలమైనదానినోటికి దడిసి ఇంకే ఆడవాళ్లూ అది చేరినరేవులోకి రారు.

వెంకడు కొంచెం హుషారు మనిషి. ఎవరినన్నా ఏడిపించడమంటే చాలాసరదా. చాకలివాడలో వయసువచ్చిన ఆడపిల్లలందరికీ వెంకడంటే చాలాఇష్టం. వాళ్లదృష్టిలో అతడొక వీరుడు. వెంకడికుటుంబానికీ రామి కుటుంబానికీ చాలా కాలంనుంచి పోట్లాట. వెంకడితండ్రి ఒకమాటు రామిగుడిసెకి నిప్పంటించాడుకూడాను. రామి అతడి నస్తమానూ తిడుతూ ఉంటుంది. ఆడముండతో ఎందుకని వెంకడుమాత్రం ఎప్పుడూ ఆట్టే ఆతిట్లని లక్ష్యపెట్టేవాడుగాదు. దానితోడి ఆడపిల్లలందరికీ అదంటే అసహ్యం. 'మొగముండ' అని వాళ్లలోవాళ్లురహస్యంగా తిట్టుకునేవారు దాన్ని, పైకి తిట్టడానికి భయపడి.

రామి రోజూ రేవులోకి వచ్చిన ఆడవాళ్ల నందరినీ తరిమివేస్తూం దని తెలిసి దానిసంగ తేమిటో కనుక్కోవాలని ఒకరోజున వెంకడు దానిరేవులోకి దిగాడు.

రామి చఱ్ఱుమని లేచింది.

'ఏరా! యెదవకానా? ఆడదానితో పోటీ కొచ్చావా?'

'మాటలు తిన్నగా రానీ యి. నువ్వు, నీకొంకీ నడేట్లో కెడతారు.'

'నేను ముందొచ్చిన రేవులోకి నువ్వెందుకొచ్చావ్? సిగ్గునేదేం?'

'ఈరేవు నీ దొక్కదానిదేకాదు; అందరూ రావొచ్చు.'

'నేను ముందొచ్చాను.'

'నేను తరవాత ఒచ్చాను.'

'పెంకి ఎదవలతో ఏంటి; ఆడళ్లతో సమంగా?'

'ఇదుగో! నువ్వు కొంచెం నెమ్మదిగా మాట్లాడితే నే నిక్కణ్ణుంచి ఎల్లిపోతాను.'

'నింపాదేంట్రా, నింపాది — నా పుల్లలన్నీ పట్టుకుంటూను!'

'పోసి! నీ కందనిపుల్లలే నేను నొల్లుకుంటానులే.'

'నీకందనిపుల్లలు నేను పట్టుకుంటాలే.'

ఇంక ఆ రేవువదలి వెళ్లిపోయినట్టయితే వెంకడు వెనుదీసిన ట్టవుతుంది.

వెంకడు తన తెప్పని గట్టుమీద పడవేసి తనూ ఒక కొంకికఱ్ఱ పుచ్చుకుని పుల్లలుపట్టడం ప్రారంభించాడు.

రామి నే విధంగా లొంగదియ్యాలో వెంకడికి తెలియలేదు. దానీడు పిల్లలంతా తనని ఊ, పొగుడుతూ ఉంటూరు. ఇదొక్కత్తే ఏదో పెద్ద తనకంటె ఎక్కువగా మాట్లాడొస్తుంది. వాళ్లకుటుంబాలకి చాలాకాలం నుంచి పోట్లాట అనుకోండి. అయినా తనెప్పుడయినా వాళ్లతో పోట్లాడాడా? పోనీ తను ఒక్కడితోటే కాదు; ఊళ్లో అందరితోటీ ఇల్లాగే పోట్లాడుతుంది ఇది. దీన్నెలాగయినా సాధించా లనుకున్నాడు వెంకడు.

గట్టుని నిలబడిపుల్లలు పట్టడంలో మాత్రం రామి వెంకణ్ణిజయించేసింది. రామినెల్లాగయినా ఓడించాలని అతడు చాలా ప్రయత్నించేవాడు గాని దానినేర్పు, అతనిబలానికంటే బాగా ఉపయోగించేది. కొంకితోపుల్లలులాగడంలో ఉండేవడుపూ, ఆదృఢత్వం వెంకడికిమాత్రం పట్టుబడలేదు. అతడెంత ప్రయత్నించినా చాలాపుల్లలు అతని కొంకికిందనించి దొర్లిపోతూ ఉండేవి. దానినేర్పరితనం చూసి అతడాశ్చర్యపడేవాడు. నడేట్లోకి వెళ్లి వచ్చినవాళ్లుకూడా అది గట్టుననిలబడిపట్టినన్ని పుల్లలు పట్టలేక పోయేవారు.

అన్నింటికంటే అతనికర్థంకానిదేమంటే దానిపెంకితనం. ఆ రేవులో నుంచిపోయే పుల్లలన్నీ అదెల్లాగా తియ్యలేదు. తక్కినవాళ్లనన్నా ఎందుకు పట్టుకోనియ్యదు?

౨

ఆనాడు గోదావరి చాలా భీకరంగా ఉంది. నాలుగుపక్కలా ఆకాశంనిండా నల్లనిమబ్బులు కమ్మివేసాయి. చినుకులు గాలి ఎక్కువగా ఉన్నాయి. చాలామంది చాకలివాళ్లుభయపడి దిగడం మానివేశారు.

ఆవేళమాత్రం వెంకడు తన తెప్పని వేసుకుని బయలుదేరాడు. ఒక ఆడదానితో పంతంపెట్టుకుని గట్టుని కూర్చోడంకంటే మొగవాళ్లలో చాలామంది చెయ్యలేని సాహసం చెయ్యాలని అతనిలోని వీరత్వం అతడిని పురికొలిపింది.

నడేట్లోనుంచి వెంకడు పుల్లలు పట్టుకొస్తున్నాడు, గట్టున నిలబడి రామి పడుతోంది. ఇద్దరిగుట్టలూ ఒకదానిప్రక్కని ఒకటి పెరిగిపోతున్నాయి.

సాయంకాలం నాలుగుగంటలయేసరికి తక్కిన చాకలివాళ్లంతా ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు. రామీ, వెంకడే మిగిలారు. వెంకడు బాగా అలిసిపోయినప్పటికీ రామికంటే ముందుగా ఇంటికిపోవడాని కతనికి మనసు ఒప్పలేదు. ఇద్దరూ అల్లా పోటీగా పుల్లలు పడుతున్నారు.

కనుచీకటి పడుతోంది. చినుకులూ, గాలీ అల్లాగే ఉన్నాయి.

'నువ్వింకా ఎంతసేపుంటా?'

'నువ్వింకా ఎంతసేపుంటా?'

వెంకడు ఒక ఆడదాని పెంకితనానికి లొంగిపోతాడా?

'ఇంకా చాలాసేపుంటా' నన్నాడు.

రామి జవాబు చెప్పకుండా నీటి అంచుని రాళ్లమీద నిలబడి వడుపుగా పుల్లల్ని దగ్గిరకి లాక్కుంటోంది.

'జాగ్రత్త! జారినీట్లోపడిపోగలవు!'

'నీసంగతి నువ్వుచూసుకో. నేపడిపోతే నువ్వేం తియ్యక్కరలేదులే!'

'నేనే తియ్యాలి. పెద్దకబుర్లుసెపుతున్నావుగాని.'

దూరాన్ని ఒకచెట్టు కొట్టుకుపోతోంది. వెంకడు, రామిమీద తన ఆధిక్యతని క్రియలో చూపించాలని, దిగి ఈదుకుంటూ వెళ్లిపోయాడు. మాటల్లో చూపించలేడన్న సంగతి అతనికి అర్థమయింది.

చెట్టు చాలా బరువుగావుంది. ఆపైని అతడు బాగా అలిసిపోయాడు. రామితో పంతంకోసం దిగాడు గాని లేకపోతే అంత అలిసిపోయినమీదట దిగడు. ఎల్లాగో ఒకలాగ నెమ్మదిగా ఆచెట్టుని లొంగదీశాడు. నెమ్మదిగా బారవేసుకుంటూ గట్టుకేసి దాన్ని కదులుస్తున్నాడు. ఒకసారి కన్నెత్తి గట్టువేపుచూశాడు. కనుచీకట్లో అతనికి సరిగ్గా ఏమీకనిపించలేదు. నెమ్మదిగా బారవేసుకుంటూ కొంత దూ

రం వచ్చాడు. గట్టు కొంచెం కనిపిస్తోంది.

రామి మొలలోతునీళ్లలో దిగి, అందీ అందని ఒక పెద్దచెట్టుని గట్టుకి లాగుతోంది.

'ఒడ్డోరకంగా ఉంది. దాన్ని ఒగ్గెయ్యి.' అని కేకవేశాడు వెంకడు.

'నీ కెందుకు? నువ్వు నీపని సూసుకో' అంది రామి.

'ఛీ! నే నెందుకు దాన్ని పలకరించాను?' అనుకున్నాడు వెంకడు. అ దేమయిపోతే తన కేం? పెంకి ముండ! దానికి తెలియదా? ఆట్టే దిగితే చస్తుంది.

కాని వెంకడు త దేకదీక్షతో గట్టుకేసి చూస్తో ఈదుతున్నాడు. రామి రెండుసార్లు కాళ్లుపట్టు తప్పితూలింది. వెంకడి నోటిచివరదాకా కేక వచ్చి ఆగిపోయింది. తనమనస్సుకి దృఢత్వం లే దనుకున్నాడు.

అటుచూడకూడదని తల కొంచెం వంచి నెమ్మదిగా గట్టుకి ఈదుతున్నాడు.

ఇంతలో అతనికి ఏదో జారి నీటిలో పడినచప్పుడు వినిపించింది. అతనిహృదయం స్తబ్ధమయిపోయింది. చేతులు చెట్టుని వదలివేశాయి. మొగముఎత్తి చూశాడు.

రామి కనబడ లేదు!

తన శక్తికొలదీ గట్టుకి విసురుగా ఈదాడు. పదిగజాలక్రింద ప్రవాహంలో ఎవరో కొట్టుకుంటున్నట్టు కనిపించింది. వెంకడు ఈదుకు వెళ్లాడు. ఒకచేత్తో రామి నెత్తిపట్టుకున్నాడు. రామి రెండుచేతులతోనూ అతని మెడ మెలివేసింది. ఇద్దరూ మునిగిపోయారు. ఒకపెద్ద ప్రయత్నంతో మెడపట్టు విడిపించుకుని ఊపిరి పీల్చుకోడాని కని పైకి వచ్చాడు. ఈసారి రామికి స్పృహ తప్పింది. నెమ్మదిగా బహుకష్టంతో దానిమెడ తనవీపుమీద ఆన్చి, దానిచేతులు తనరొమ్ముకి చుట్టుకుని తన తెప్పమీద ఆనుకుని కొంచెం నిలదొక్కాడు. ఈ పాటికి గట్టుదగ్గరనుంచి వారిని ప్రవాహంలోపలికి నెట్టింది. అతనికి గట్టు కేవిధంగా చేరాలో తెలియలేదు. పుల్లలు పట్టిపట్టి అలిసిపోయి ఉన్నాడు. అల్లాగే నెమ్మదిగా బారవేసుకుంటూ గట్టుదగ్గరగా వచ్చాడు. అక్కడ గట్టుని ప్రవాహం నిలువునా కోసివేసింది. అతిప్రయత్నంతో చెయ్యిఎత్తి గట్టుమీద వేశాడు. అండ ఊడిపోయింది. కొంచెం మునిగిపోయాడు. ఇంక తనకి మూర్ఛవస్తుందేమోననిపించింది. ఎడం చేత్తో గట్టుని పట్టుకుని, రామి దేహాన్ని నెమ్మదిగా గట్టుమీదికి ఎక్కించాడు కుడిచేత్తో. తరవాత నెమ్మదిగా తనూ గట్టెక్కి ఒక పదినిమిషాలు వెల్లగిల పడుకున్నాడు ఆయాసం తీర్చుకోడానికి.

రామి కొంచెం కదిలింది. మెల్లిగా 'యెంకా!' అంది. మళ్లీ మూలగ లేదు.

వెంకడు దాన్ని భుజాన్ని వేసుకుని, చాకలివాడ కేసి బయలు దేరాడు.

తను బయటికి తీసినట్టుగా దానికి తెలుసును. అంచేతే 'ఎంకా!' అంది. అసలు మొట్టమొదట తనపీక పట్టుకున్నప్పుడు దానికి స్మారకం ఉందిగా! చూశే ఉంటుంది. ఆపైనిగట్టునింకెవరూ లేరు కూడాను. అంతకితమే అన్నాడు దానితో వేళాకోళంగా, 'నువ్వు పడిపోతే నేనే తియ్యా'లని! తమాషా! చివర కల్లాగే అయింది.

దానితో తనెందుకు పంతం వేసుకున్నాడు? ఎందుకు అసహ్యించుకొన్నాడో దాన్నింతకాలం! అది శుద్ధ పొగరుబోతయితే దానిజోలి తన కెందుకు? దాన్ని ఎల్లాగయినా లొంగదియ్యాలనుకున్నాడు. లొంగదియ్య లేకపోయాడు. అదీ! అంచేతే అదంటే కోపం తనకి. దానితో పుల్లలు పట్టడంలో ఎవరు పోటీచెయ్యగలరు? తక్కిన ఆడవాళ్లకీ దానికీ పోలికే లేదు. అది అసలుపిల్ల. కొంచెం పెంకిది నిజమే. తనుమాత్రం పెంకివాడుగాడూ?

అది పడిపోవడం, తను తన ప్రాణాలుపోయే పరిస్థితులు వచ్చినాసరే వదలకుండా దాన్ని గట్టుకితియ్యడం! ఇంతటి ఘనకార్యం తన జీవితంలో ఎప్పుడూ చెయ్య లేదు. అంతా చాలాసార్లు అతని ధైర్యాన్ని పొగిడారు కాని, ఇది ఎవరూ పొగడడానికి సాధ్యం గానిది. ఇంతకష్టపడి రక్షించిన ఆమెదేహం, నైతికంగా తన దైపోయిం దనుకున్నాడు వెంకడు. ఆమెనొకవిధంగా జయించా ననుకున్నాడు.

వెంకడికి, ప్రపంచకంలో ఏ ఆడపిల్ల వంటికీ, ఈ పొంకం, ఈ నునుపూ, ఈ మెత్తదనం ఉండ దనిపించింది.

నెమ్మదిగా దాన్ని కిందకి దింపి వెంకడు రామి తల్లిదండ్రుల్ని పిలిచాడు.

అంతా చుట్టూ చేరారు. రామి తల్లి గొల్లుమని ఏడవడం మొదలుపెట్టింది. తండ్రి నిస్తబ్ధుడయిపోయి ఒకమూల కూర్చున్నాడు. తక్కిన

చాకలిపెద్ద లంతా చుట్టూ జేరి దాన్ని బ్రతికించే ఉపాయాలు చూస్తున్నారు. కడుపుతొక్కి నీళ్లుతీశారు. మంట వేసి కడుపు కాచడం మొదలు పెట్టారు.

రామితల్లి గొంతెత్తి ఏడుస్తోంది.

'ఎంకడు సంపేశాడట్రోయి. నా తల్లి నెంకడు ముంచేశాడట్రోయి.'

వెంక డా ఏడుపుని వినిపించుకో లేదు. అలసిపోయిన చూపులతో రామిని చూస్తున్నాడు.

రామి కొంచెం కదిలింది. కళ్లు సగం విడివడ్డాయి. వెంకడు దగ్గరగా వెళ్లాడు

రామి 'ఎంకడు, ఎం'డు' అంది.

ఆ అనేటప్పుడు బాధచేత మరుగు పడిపోయిన దాని చిఱునవ్వుని వెంకడుతప్ప ఇంకెవరూ గ్రహించలేదు.

వెంకడిహృదయం జల్లుమంది. అది తన చిరునవ్వులో తనుచేసిన సహాయానికి కృతజ్ఞత చూపింది.

రామితల్లికి అది పలవరించిన 'ఎంకడు' అన్నముక్క దాని అను మానం స్థిరపరచటానికి సరిపో యింది.

దాని ఏడుపు ఎక్కువయింది.

'అమ్మో! దొంగనాకొడుకోయి. నాతల్లిని ముంచేశాడమ్మో! ఎవరూ లేకండాసూసి ముంచేశాడట్రో!'

వెంకడు నిర్ఘాంతపోయాడు. తనింతా శ్రమపడితే ప్రతిఫలం ఇదా? ఛీ! వెధవప్రపంచకం అనుకున్నాడు వెంకడు.

రామికి ఎగ ఊపిరి పట్టింది. అంత సేపు స్తబ్ధుడైకూర్చున్న రామితండ్రి చట్టున లేచి వెంకడితో

'నీసంగతి కనుక్కుంటా నుండు పోలీసోళ్లని తీసుకొత్తాను.' అని గబగబా వెళ్లిపోయాడు.

వెంక డిందాకా కొంచెం అలిసి పోయి ఉంటే రామితో తనూ గోదావరిలో కలిసిపోయిఉండును. అంత కష్టపడి దాన్ని పయికితీశాడు. దాని ప్రాణమా చివరకి కాపాడ లేకపోయాడు. తనకి చివరకి మిగిలింది ఈ అభియోగం.

ఈ విషమరహస్యం అతని కర్థం కాలేదు.

వెంక డీప్రపంచకం అంతా చెడ్డ దనుకున్నాడు. తనూ రామే ఈ ప్రపంచకంలో తప్పపుట్టారు.

సవరణ

భారతి, ఈశ్వరనామ సంవత్సరము ఫాల్గునమాస సంచికలో ౨౫౪ పుట, రెండవ కాలము పంక్తి ౧౭ తర్వాత చదువవలసినది. "ఇందులో 'చతుర్థకుల వనజ వన మార్తాండుఁ' డని యున్నది." మూడవ కాలములో చివర ౧౧౪ సంఖ్య ౧౧౫౭ గా చదువవలెను. ౨౫౬ పుట రెండవకాలములో ౧౫ వ పంక్తిలో ౯౩౬ సంఖ్య ౯౧౬ గా చదువవలెను.

కా. భా.